బోనాల ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలి



బోనాల ఉత్సవాలను ప్రారంభిస్తున్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాలను ప్రజలు ఆనందోత్సవాలతో వైభవంగా జరుపుకోవాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై హరిబౌలీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం 76వ వార్షిక బోనాల ఉత్సవాలను ధ్వజారోహణతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం అమ్మవారికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అర్చన చేశారు.

వైభవంగా చాతుర్మాస దీక్షలు



అంపశయనపై రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: చాతుర్మాస దీక్షలు వైభవంగా ప్రారంభమయ్యాయి. లంగర్‌హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో చాతుర్మాస దీక్షలను పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా చేస్తున్నారు. ఇందులో భాగంగా మేకులతో కూడిన అంపశయనపై ఆయన ఆసీనులయ్యి ప్రతిరోజూ కఠోర దీక్ష చేయనున్నారు. ఆలయంలో ప్రతిరోజూ హోమాలు, రాత్రి స్వామి వారిని పల్లకీలో ఊరేగించనున్నారు. ఇచ్చిన మాట కోసం బలిచక్రవర్తి శ్రీవిష్ణువు దేవశయన ఏకాదశి రోజు పాతాలంలోకి వెళ్లి నాలుగా మాసాలు అక్కడే ఉన్నారని రాహుల్‌దాస్ బాబా అన్నారు. ఈ నాలుగు మాసాలు ప్రజల యోగక్షేమాల కోసం మునులు, సాధువులు కఠోర దీక్షలు చేయాలని, ప్రజలు భక్తిశ్రద్ధలతో అందరు దేవుళ్లను పూజించాలని మహావిష్ణువు సూచించారన్నారు. సంగం ఆలయంలో చాతుర్మాస దీక్షలు నాలుగు మాసాలు కొనసాగుతాయన్నారు. ఈ పూజల్లో పూజారులు రింకు, నారాయణ, శ్యాం అగర్వాల్, శ్రీనివాస్‌లు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో డాక్టర్ వై.ఎస్.రాజన్ తదితరులు

గోల్కొండ: భారతదేశం టెలికమ్యూనికేషన్స్, సైబర్ ఫిజిక్స్‌తో పాటు ఇతర సాంకేతిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ అగ్రదేశాల సరసన చోటు సంపాదించిందని ఇస్రో విశ్రాంత కార్యదర్శి డాక్టర్ వై.ఎస్.రాజన్ అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో కమ్యూనికేషన్స్ అండ్ సైబర్ ఫిజిక్స్‌పై రెండు రోజుల అంతర్జాతీయ సమావేశం శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి డాక్టర్ వై.ఎస్.రాజన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వాలన చేసి మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో యువ సైంటిస్టులు ఎంతో ఉత్సాహంతో ముందుకు వచ్చి పరిశోధనలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీఐ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ మాలతీ బటుమాలే, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కళాశాల ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ అండ్ బేసిక్ సైన్సెస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఆహ్వానం



గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కృష్ణ, శ్రీనివాస్, లింగం, మనీష్, శేఖర్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

జియాగూడ: గోషామహల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నానని ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. శుక్రవారం మంగళ్‌హాట్ డివిజన్‌లోని యతీమ్‌ఖాన్, శివలాల్‌నగర్, మహాలక్ష్మీనగర్, రహీంపురా జెండా ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ రూ.30 లక్షల నిధులతో సీవరేజీ పనులు, సీసీ రోడ్డు పనులకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ, గోషామహల్ కన్వీనర్ ఎం.కృష్ణ, బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపీశెట్టి ప్రమోద్, మంగళ్‌హాట్ డివిజన్ అధ్యక్షుడు బబ్లూ గౌడ్, ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్, అధికార ప్రతినిధి జేడే ముఖేష్ సింగ్, ఉపాధ్యక్షుడు డి.నరహరి పాల్గొన్నారు.



అమ్మవారి వృత్తిపని వారి సేవలు వెలకట్టలేనివి



వృత్తిపని సంఘం వారిని సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: అమ్మవారి వృత్తిపని వారి సేవలు వెలకట్టలేనివని లాల్‌దర్వాజ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ అరవింద్ అన్నారు. శుక్రవారం ఆయన మహంకాళి మహేష్‌గౌడ్ బోనాల ఉత్సవ అవార్డును అమ్మవారి వృత్తిపని వారికి అందించారు. గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారు దశాబ్దాలుగా అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా అమూల్యమైన సేవలు అందిస్తున్నారన్నారు. వృత్తిపని వారి సంఘానికి అధ్యక్షుడు బి.సాయిబాబాచారి నిర్దిష్టమైన సేవలు అందిస్తూ వృత్తిపని వారికి గుర్తింపు తెచ్చారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన బి.సాయిబాబాచారి, లలితకుమారి, నర్సింగ్‌రావు, కుమ్మరి వి.రాజు, నర్సమ్మ, పోచమ్మ తదితరులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అదే విధంగా బి.శ్రీకాంత్‌చారికి ఉత్తమ సేవా అవార్డు అందజేశారు.

ఘనంగా రుద్ర సహిత త్రి శత చండీ మహాయాగం

చార్మినార్: లోకకల్యాణార్థం మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ రుద్ర సహిత త్రి శత చండీ మహాయాగం ఘనంగా జరిగింది. ఉప్పుటూరి కిరణ్-కవిత దంపతులు మహాయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన రుద్ర సహిత త్రిశతచండీ మహాయాగం పూజా కార్యక్రమాలు 26వ తేదీ వరకు కొనసాగనున్నాయని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.



మహాయాగంలో పాల్గొన్న ఉప్పుటూరి కిరణ్-కవిత దంపతులు

గోమాత రక్షణకు సంతకాల సేకరణ



అఫ్జల్‌గంజ్: గోమాత రక్షణ కోసం బజరంగ్ సేనా నిరంతరం ఉద్యమాలు చేస్తుందని బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. అఫ్జల్‌గంజ్ ఎంజే బ్రిడ్జి వద్ద బజరంగ్ సేనా ఆధ్వర్యంలో గో మాత రక్షణకు సంతకాల సేకరణ చేశారు. ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ...గోవధ నిషేధ చట్టం ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే విధంగా తమ ఉద్యమం నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్‌తివారి, ఎర్రం శ్రీనివాస్, మనోజ్ మొగల్ గడ్డి, సునీల్ అగర్వాల్, నరేష్, ప్రవీణ్‌యాదవ్, సంజయ్ ధైమా పాల్గొన్నారు.

కుమారుడు, బంధువుల నుంచి రక్షణ కల్పించండి

గన్‌ఫౌండ్రీ: ఆస్తి కోసం కన్నకొడుకే ఓ తండ్రిపై దాడి చేయించాడు. తన కుమారుడు, కోడలు, బంధువుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ బాధిత తండ్రి కల్లెం నర్సింహారెడ్డి (85) శుక్రవారం తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దోమలగూడ ప్రాంతానికి చెందిన తనకు ఒక కుమారుడు, ఐదుగురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. కుమారుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోడలు పద్మలత తన ఆస్తికోసం కొంపల్లికి చెందిన ఎస్‌వీఆర్ గార్డెన్స్ యజమాని ఎస్.నర్సింహారెడ్డితో కలిసి దాడి చేశారని ఆరోపించారు. ఎస్.నర్సింహారెడ్డి కుటుంబ గెట్ టు గెదర్ ఉందని పిలిచి పెద్దల సమక్షంలో తనపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడుతూ తలపై దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రెండు రోజులు ఆసుపత్రిలో చికిత్స పొందానని తన కొడుకు, కోడలికి నా పేరిట ఉన్న ఆస్తి మొత్తాన్ని ఇస్తానని చెప్పినప్పటికీ వినకుండా అకారణంగా దాడిచేసి బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన బంధువుల నుంచి తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

పాతబస్తీలో బోనాల జాతర షురూ..

- కలశ స్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు
- 21న పాతబస్తీలో సామూహిక ఘట స్థాపన ఊరేగింపు
- 28న అమ్మవారికి బోనాల సమర్పణ

చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు శుక్రవారం పాతబస్తీలో ప్రారంభమయ్యాయి. పాతబస్తీలోని అన్ని ఆలయాల్లో కలశ స్థాపనతో ప్రారంభమైన ఈ బోనాల జాతర ఉత్సవాలు ఈనెల 30వ తేదీతో ముగియనున్నాయి. శుక్రవారం ఉదయం పాతబస్తీలోని చారిత్రాత్మకమైన పురాతన ఆలయాల అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, నైవేద్యం, తీర్థ ప్రసాదాలతో బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

పాతబస్తీలోని ప్రధాన ఆలయాల్లో..

లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయం, మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయం, ఉప్పుగూడ శ్రీ మహంకాళి ఆలయం, గౌలిపురా శ్రీ మహంకాళి మాతేశ్వరీ ఆలయం, సుల్తాన్‌షాహి జగదాంబ మహంకాళి ఆలయం, మురాద్‌మహల్ మహంకాళి ఆలయం, సుల్తాన్‌షాహి బంగారు మైసమ్మ ఆలయం, గౌలిపురా నల్లపోచమ్మ ఆలయం, రాంబక్షి బండ మహంకాళి ఆలయం, బేలా ముత్యాలమ్మ ఆలయం, హరిబౌలి బంగారు మైసమ్మ ఆలయం, హరిబౌలి అక్కన్న మాదన్న ఆలయం, రాంసింగ్‌బాడా బంగారు మైసమ్మ మహంకాళి ఆలయం, మక్తూంపురా ఎల్లమ్మ ఆలయం, సుల్తాన్‌షాహి రేణుకాఎల్లమ్మ ఆలయం, గౌలిపురా బంగారు మైసమ్మ ఆలయం, మేకలబండ నల్లపోచమ్మ ఆలయం, మీర్‌చౌక్ బంగారు మైసమ్మ ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి మహంకాళి అమ్మవార్లకు నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఈసారి బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.



మీరాలంమండి ఘటస్థాపన ఊరేగింపులో పోతరాజు వీరంగం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న చార్మినార్ తహసీల్దార్ నిహారిక



పూజల్లో ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, శోభారాణి దంపతులు



మాతేశ్వరి ఘటం ఊరేగింపునకు స్వాగతం పలుకుతున్న పోతరాజులు, భక్తులు



బోనాల ఉత్సవాల వివరాలను వెల్లడిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షులు ఆదర్ల మహేశ్

మీరాలంమండి మాతేశ్వరి ఘటం ఊరేగింపు

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో వేద పండితులమంత్రోచ్ఛరణల నడుమ మాతేశ్వరి ఘటం ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. అలీజా కోట్లలోని కోట మైసమ్మ ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాతేశ్వరి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మీరాలం మండి ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.

నల్ల పోచమ్మ ఆలయంలో..

గౌలిపురా: సీబీఐ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్ అన్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన బోనాల ఉత్సవాల వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ.. నల్ల పోచమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు అమ్మవారికి కుంభాభిషేకం, గణపతి హోమం, నవగ్రహ పూజ, కలశ స్థాపనతో బోనాల ఉత్సవాలను ఘనంగా ప్రారంభించామన్నారు. ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు కొడి సురేందర్, దేవేందర్, చిరంజీవి, కోశాధికారి మెరుగు బ్రహ్మానందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ స్థాపన..

మహంకాళి మాతేశ్వరి భరతమాత ఆలయంలో శుక్రవారం ఉపాధ్యక్షుడు మంకాల రమేష్, శశిరేఖ దంపతులు గణపతి హోమం, ఆలయ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, శోభారాణి దంపతులు కలశ స్థాపన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కోట మైసమ్మ ఆలయంలో కోశాధికారి బొడ్డు సాయిబాబా, సరిత దంపతులు కలశ స్థాపన పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మల్లేషం గౌడ్, కె.ఎస్.ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, మధుసూదన్ గిరి, మామిడి కృష్ణ, బి.వై.శ్రీకాంత్, జానకీరామ్, రమన్‌రాజ్, ఎం.ప్రకాశ్, మహేందర్ గిరి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పనిచేసే సీనియర్లను గుర్తించాలి



అఫ్జలుద్దీన్

నాంపల్లి: నామినేటెడ్ పదవుల్లో సీనియర్ నేతలకు అవకాశం కల్పించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్.కె.అఫ్జలుద్దీన్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మల్లేపల్లిలోని ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందన్నారు. పార్టీలో కార్యదర్శి నుంచి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగినట్లు వివరించారు. తనకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వనప్పటికీ ఏనాడూ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన దాఖలాలు లేవని తెలిపారు. గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో గవర్నర్ కోటాలో తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినట్లే ఇచ్చి గుంజుకున్నారని, తనను కాదని ఎమ్మెల్సీ పదవి ఇచ్చినోళ్లు ఇప్పుడే ఏ పార్టీలో ఉన్నారో అందరికీ తెలుసని గుర్తు చేశారు. కనీసం ఇప్పుడైనా తనకు రాజ్యసభ లేదా ఏదైనా చైర్మన్ పదవిని ఇవ్వాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంభించడం సరికాదని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కాన్ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ పి.సురేష్ అన్నారు. గ్రామీణ తపాల, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థల ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో తపాలశాఖ కార్యాలయం ముందు ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు ఎ.శ్రవణ్‌కుమార్, ఎం.మదుసుధన్ రావు, ముకేష్, శ్రీకాంత్, సోమేష్ పాల్గొన్నారు.

ప్రధాన పార్టీలు రాజకీయ సమానత్వం పాటించాలి



మాట్లాడుతున్న చొల్లేటి ప్రభాకర్

నాంపల్లి: ప్రధాన రాజకీయ పార్టీలు దళిత గిరిజనులకు రాష్ట్ర అధ్యక్ష పదవుల్లో అవకాశాలు కల్పించాలని పలువురు దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో సాంఘిక న్యాయం-రాజ్య సమానత్వం-రాజ్యాంగం అనే అంశంపై సమాలోచన సభ జరిగింది. ఎస్సీ, ఎస్టీ ఐక్య సంఘటన ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఎస్‌సీఆర్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.బాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు విద్యాసాగర్ అంగలకుర్తి, చొల్లేటి ప్రభాకర్, ఏఐఎస్‌సీఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు ఆర్.నాగేశ్వరరావు, ఎస్‌సీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.సుదర్శన్ బాబు దొమ్మాటి, కళానిధి మాస్టారు. ప్రొఫెసర్ చందూ నాయక్, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, మాదిగ జేఏసీ చైర్మన్ సంగీతం రాజలింగం తదితరులు హాజరై ప్రసంగించారు.

వ్యాపారుల్లో తనిఖీల టెన్షన్

- బిల్లులున్నా వ్యాపారులకు తప్పని తిప్పలు
- వాణిజ్యపన్నుల శాఖ అధికారుల ఇష్టారాజ్యం!

అబిడ్స్: వాణిజ్యపన్నుల శాఖలో కొంత మంది అధికారులు చెకింగ్‌ల పేరుతో వ్యాపారులను, ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులను వేధిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ చార్మినార్ డివిజన్ అధికారులు సరూర్‌నగర్ డివిజన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా తనిఖీలు చేస్తూ వేధిస్తున్నారని పలువురు వ్యాపారులు వాపోయారు. ఆరంఘర్, గగన్‌పహాడ్, కాటేదాన్, శంషాబాద్ ప్రాంతాల్లో చార్మినార్ డివిజన్‌కు చెందిన పలువురు ఏసీటీఓలు, ఇతర అధికారులు వ్యాపారులను తనిఖీలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అదే విధంగా మాదాపూర్ డివిజన్ అధికారులు కూడా ఎలాంటి అనుమతులు లేకుండా సరూర్‌నగర్ డివిజన్ ప్రాంతంలో తరచూ తనిఖీలు చేస్తున్నారన్నారు.

అనుమతులు లేకుండానే తనిఖీలా..?

వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా వీటీసీ (వెహికిల్ ట్రాఫిక్ చెకింగ్) పేరుతో హైదరాబాద్ రూరల్ డివిజన్ ఏసీటీఓలు హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన మెదక్, జహీరాబాద్, నిజామాబాద్ డివిజన్లలో తనిఖీలు చేస్తూ వ్యాపారస్థులను వేధిస్తున్నారని పలువురు వాపోతున్నారు. అదే విధంగా అబిడ్స్ డివిజన్ ఏసీటీఓలు కొంత మంది సరూర్‌నగర్‌తో పాటు చార్మినార్ డివిజన్ పరిధిలో కూడాలో తిరుగుతూ తనిఖీల పేరుతో వ్యాపారులను వేధిస్తున్నారని పలువురు పేర్కొన్నారు. బిల్లులు, వే బిల్లులు ఉన్నప్పటికీ ఏదో ఒక పేరుతో వ్యాపారులను వేధింపులకు పాల్పడుతున్నారని వారన్నారు. రాంగ్ డిస్టినేషన్ హైకోర్టు జడ్జిమెంట్ ఉన్నప్పటికీ ఏసీటీఓ స్థాయి అధికారులు వ్యాపారులను వేధిస్తున్నారన్నారు.

50 కిలో మీటర్లలోపు అవసరం లేకున్నా..

50 కిలోమీటర్ల లోపు ట్రాన్స్‌పోర్టు నుంచి డీలర్, డీలర్ నుంచి ట్రాన్స్‌పోర్టు వరకు పార్ట్-బీ అవసరం లేకున్నా వాణిజ్యపన్నుల శాఖ అధికారులు తనిఖీలతో వేధిస్తున్నారని డీలర్లు పేర్కొంటున్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో వ్యాపారుల కోసం అడ్వాన్స్ రూలింగ్ ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పలు విధాల ఏసీటీఓస్ స్థాయి అధికారులు కొన్ని నెలలుగా వ్యాపారులకు నరకయాతన చూపిస్తున్నారన్నారు.

డ్రైవర్లు, ప్రైవేటు వ్యక్తులదే హవా..

చెకింగ్‌ల పేరిట అనుమతులు లేకున్నప్పటికీ పలువురు అధికారులు వాహనాలను ఆపి తనిఖీలు చేస్తున్నారు. అధికారుల డ్రైవర్లు, ప్రైవేటు వ్యక్తులు గోగుల్‌పే, ఫోన్‌పే ద్వారా ఎవరైనా డీలర్లు డబ్బులు ఇచ్చినచో ఆ డీలర్లకు వత్తాసు పలుకుతున్నారని వారంటున్నారు. ప్రైవేటు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా అధికారుల కంటే ముందు వాహనాలను ఆపి తనిఖీలు చేస్తూ వ్యాపారులను నానా రకాల వేధింపులకు గురి చేస్తున్నారని వారన్నారు.

ఇటీవలనే హంగామా జరిగినా..

గత నెలరోజుల క్రితం గోషామహల్ రవి పెట్రోల్ బంక్ వద్ద ఒక అధికారి తనిఖీలు చేస్తుండగా మరో అధికారి ఎందుకు తనిఖీలు చేస్తున్నావంటూ రోడ్డుపైనే నానా హంగామా సృష్టించారు. దాదాపు 4 గంటల పాటు గోషామహల్ రోడ్డులో ఇద్దరు అధికారుల మధ్య వివాదం చెలరేగడంతో ఓ అధికారి స్వయంగా వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేశారు. ఇలా తనిఖీల పేరు మీద వివాదాలు జరుగుతున్నా అధికారులలో చలనం రావడం లేదు. అదే విధంగా రూ.50 వేల లోపు సామగ్రికి వే బిల్లు అవసరం లేకున్నా అధికారులు వేధిస్తున్నారని పేర్కొంటున్నారు. కొంత మంది అధికారులు బిల్లులు, వే బిల్లులు ఉన్నప్పటికీ అండర్ వ్యాల్యూ పేరుతో వ్యాపారులను వేధిస్తున్నారన్నారు.

గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి



పనులను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. శుక్రవారం ఆయన మార్కండేయనగర్‌లో రూ.20 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి.కిషన్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. త్వరలోనే డివిజన్‌లో రోడ్డు పనులు కూడా ప్రారంభం కానున్నాయని ఆయన అన్నారు. వీడీ, సీసీ రోడ్డు పనులు, ప్రధాన రహదారులపై సీసీ రోడ్లు వేయాలని తాను కేంద్ర మంత్రిని కోరామన్నారు. త్వరలోనే గుడిమల్కాపూర్ డివిజన్‌లో తాను స్వయంగా పర్యటిస్తానని తనకు మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నామా యాదగిరి, గంగాధర్, సుధాకర్ యాదవ్ తదితరులున్నారు.

యువకుడి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: వ్యక్తిగత సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఆసిఫ్‌నగర్ కుమ్మరివాడిలో నివసించే డి.సాయిరామ్(23) ఇటీవల తన చదువును పూర్తి చేశాడు. కొద్ది కాలంగా మానసిక వేదనకు గురవుతున్న అతడు ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు అతడు ఈ విషయం తన స్నేహితుడికి ఫోన్ ద్వారా తెలిపినట్లు సమాచారం. స్నేహితుడు సాయిరామ్ ఇంటికి వచ్చి స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అప్పటికి మృతిచెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.